

29 నుంచి ఇంటర్వ్యూలు

అరసవల్లి, జనవరి 25: ఆన్‌లైన్‌లో గతంలో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 29, 30 తేదీల్లో శ్రీకాకుళంలోని జిల్లా నెహ్రూ యువకేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు జిల్లా యువజన అధికారి కె.వెంకట్ ఉజ్వల్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, మందస, కాశీబుగ్గ, కొత్తూరు, కోటబొమ్మాళి, టెక్కలి బ్లాకుల్లో 29న, నరసన్నపేట, సారవకోట, గార, ఆమదాలవలస, ఎస్.ఎం.పురం, రణస్థలం బ్లాకుల్లో 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లను, ఆన్‌లైన్ దరఖాస్తులు రెండుసెట్ల జిరాక్స్ కాపీలతో ఉదయం 9.30 గంటలకు హాజరుకావాలని సూచించారు.



శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

గణతంత్ర వేడుకలకు సర్వసన్నద్ధం

- ప్రభుత్వ డిగ్రీకళాశాల మైదానంలో నిర్వహణకు ఏర్పాట్లు
- ఉత్తమ సేవలకుగాను 254 మందికి గుర్తింపు
- నేడు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు ప్రదానం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం గణతంత్ర వేడుకలకు ముస్తాబైంది. శుక్రవారం ఉదయం జాతీయ జెండాను కలెక్టర్ శ్రీకేష్‌బాలాజీ లఠ్కర్ ఎగురవేయనున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిదులు పాల్గొంటారు. ఏర్పాట్లను జేసీ నవీన్‌కుమార్, ఎస్పీ రాధిక గురువారం పరిశీలించారు. ముందస్తుగా పోలీసుపరేడ్ నిర్వహించారు. భద్రతాపరంగా లోపాలు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. జిల్లావ్యాప్తంగా 85 ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఉత్తమసేవలకు గుర్తింపుగా 246 మంది ఉద్యోగులను ఎంపిక చేశారు. వీళ్లందరికీ కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేస్తారు. అలాగే 8 మంది ఎన్జీవో (నాన్ గవ్ట్ ఆర్గనైజేషన్స్)లకు ప్రశంసాపత్రాలు అందించనున్నారు. మొత్తం 254మంది అవార్డులకు ఎంపికచేశారు. స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలను సత్కరించనున్నారు. ప్రభుత్వ శాఖల వారీగా ప్రగతిని ప్రజలకు తెలిపే శకటాలను ప్రదర్శించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.




ఏర్పాట్లు పరిశీలిస్తున్న జేసీ నవీన్, ఎస్పీ రాధిక

ఏర్పాట్లు పరిశీలన

కలెక్టరేట్, జనవరి 25: గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని జేసీ ఎం.నవీన్ ఆదేశించారు. గురువారం శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, జిల్లా అధికారులు ప్రొటోకాల్ ప్రకారం కూర్చొనేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలంతా వేడుకలు వీక్షించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సహాయ కలెక్టర్ రాఘవేంద్ర మీనాతో పాటు ఆర్డీవో సీహెచ్ రంగయ్య, నగర పాలక కమిషనర్ చల్లా ఓబులేసు, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డ్వామా పీడీ చిట్టిబాబు, డీఈవో వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వెంకటరావు పాల్గొన్నారు.

ఓటు.. మన బాధ్యత

- వయోవృద్ధులను ఆదర్శంగా తీసుకోవాలి
- కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్

అరసవల్లి, జనవరి 25: 'ఓటుహక్కు మన బాధ్యత. ఓటుహక్కు వినియోగించుకుంటున్న వృద్ధులను యువత ఆదర్శంగా తీసుకోవాలి' అని కలెక్టర్ శ్రీకేష్‌బాలాజీ లఠ్కర్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం శ్రీకాకుళంలోని బాపూజీ కళామందిర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 'జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి. ఓటు ప్రాముఖ్యత తెలిసేలా బాధ్యత వహించి యువత దేశానికి సేవ చేయాలి. ప్రతి పౌరుడూ ఓటరుగా నమోదు కావాలి. ఓటుహక్కు వినియోగించుకోకపోతే ప్రభుత్వ ధనం చాలా వృథా అవుతుంది' అని కలెక్టర్ తెలిపారు. ఓటుహక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. జేసీ, స్వీప్ నోడల్ అధికారి ఎం.నవీన్ మాట్లాడుతూ.. జీవితంలో ఒక వ్యక్తి 10 లేదా 12 సార్లు మాత్రమే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. దానిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొత్తగా నమోదు చేసుకున్న యువతీ, యువకులకు ఓటరుకార్డులు అందజేశారు. ముందుగా వివిధ కళాశాలల విద్యార్థులు, ఓటర్లు, అధికారులతో కలిసి సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో హెచ్.రంగయ్య, డీఆర్డీఏ పీడీ విద్యాసాగర్, డీపీవో రవికుమార్, కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్


విద్యార్థుల మానవహారం

ఏదడిగినా.. తెలియదంతే!

- రణస్థలం మండలానికి చెందిన శ్రీను ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల పండుగ సమయంలో ఇంటికి వచ్చిన బంధువు రెండో తరగతిలోని తెలుగు పద్యాన్ని అడుగ్గా శ్రీను బేల చూపులు చూశాడు. కనీసం గుణింతం చెప్పలేకపోయాడు. చిన్నచిన్న లెక్కలు, భాగాహారాలు అడిగినా ఆ విద్యార్థి నోరు పెగలకపోవడంతో ఆశ్చర్యపడడం బంధువు వంతైంది.

- దుర్గ అనే విద్యార్థి ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కుటుంబసభ్యులు టైము ఎంతైందని అడిగితే.. ఇంట్లో ఉన్న గడియారం చూసి చెప్పలేకపోతున్నాడు. సెల్‌ఫోన్ చూసి చెబుతుంటాడు. దీంతో రూ.వేలకు వేలు ఫీజులు కట్టి చదివిస్తే కనీసం టైము కూడా చెప్పలేని స్థితిలో కుమారుడు ఉన్నాడంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

- తొమ్మిది, పదో తరగతికి చెందిన కొంతమంది విద్యార్థులకు ద్రవ పదార్థాలను లీటర్లలో, ఘన పదార్థాలను కిలోల్లో కొలుస్తారని తెలియదు. మిల్లీమీటర్లు, సెంటీమీటర్లు, కిలోమీటర్ల లెక్క కూడా తెలియదు. బరువు, సామర్థ్యం, కొలతలపై కనీస అవగాహన లేదు. అలా తెలుసుకోవడానికి వారు సెల్‌ఫోన్లు, కాలిక్యులేటర్లు, యూట్యూబ్‌లను ఆశ్రయిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.



- చిన్న చిన్న లెక్కలూ రావు
- ఇంగ్లీష్ పదాలు పలకలేరు
- చదివేది పదో తరగతి.. కానీ రెండో తరగతి పాఠ్యాంశాల నుంచి సమాధానాలు కరువు
- అన్నింటికీ సెల్‌ఫోన్‌లే ఆధారం
- జాతీయస్థాయి సర్వేలో వెల్లడి

(రణస్థలం)


గతంలో గుణాత్మకమైన విద్య అందేది. విజ్ఞానానికి, సమాజ అవగాహనకు విద్యాబోధనలో ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను టార్గెట్ చేసుకొని ఆన్‌లైన్ బోధనకు ప్రాధాన్యమిస్తున్నారు. విద్యార్థి చేతిలో సెల్‌ఫోన్ పెట్టి బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థి తన చుట్టూ ఏం జరుగుతుందో కూడా తెలుసుకోకుండా విద్యను అభ్యసిస్తున్న దౌర్భాగ్య పరిస్థితి నెలకొంది. కిలోలు, లీటర్ల లెక్కలు తెలుసుకోలేకపోతున్నారు. చిన్నచిన్న లెక్కలకు కూడా క్యాలిక్యులేటర్లను వినియోగిస్తున్నారు. చివరకు టైమ్ చెప్పేందుకు కూడా గడియారాలు కాకుండా.. సెల్‌ఫోన్లపైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో 88 శాతం మంది విద్యార్థులు సెల్‌ఫోన్లతోనే గడుపుతూ.. యూట్యూబ్, గూగుల్ వినియోగిస్తున్నారు. దాని ప్రభావం చదువుపై పడుతోంది. వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చినట్టు చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఇటీవల ప్రథమ్ అనే సంస్థ జాతీయ స్థాయిలో పిల్లల చదువుపై సర్వే చేపట్టింది. దేశవ్యాప్తంగా 28 జిల్లాల్లో డిసెంబరులో ఈ సర్వే కొనసాగింది. మన రాష్ట్రానికి సంబంధించి శ్రీకాకుళం జిల్లాలో సర్వే చేపట్టింది. ఇటీవల మూడు వయసుల విభాగాల్లో సర్వే ఫలితాలను ప్రకటించగా.. కళ్లు బైర్లు కమ్మే నిజాలు వెలుగుచూశాయి. విద్యార్థులకు కనీసస్థాయిలో విషయ పరిజ్ఞానం లేకపోవడం చర్చనీయాంశమవుతోంది.

డ్రాపౌట్స్ ఎక్కువే..

జిల్లాలో డ్రాపౌట్స్ లేరని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. కానీ 1.3 శాతం మంది విద్యార్థులు పాఠశాల, ఆపై కళాశాల స్థాయికి వెళ్లడం లేదని సర్వే తేల్చింది. గత నెలలో సర్వే చేసే సమయంలో 32.1 శాతం మంది బాలురు, 12.1శాతం మంది బాలికలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఉండిపోయారు. వ్యవసాయ, వ్యవసాయేతర పనులకు ఎక్కువ మంది హాజరైనట్టు సర్వేలో తేలింది.

సర్వే ఫలితాలు ఇవీ

- 14 నుంచి 16 ఏళ్ల మధ్య వయసున్న వారిలో 24.6 శాతం మంది రెండో తరగతి పాఠ్యపుస్తకాల్లో పదాలు, వాక్యాలు చదవలేకపోతున్నారని సర్వేలో తేలింది. '41.4శాతం చిన్నచిన్న భాగాహారాలు కూడా చేయలేకపోతున్నారు. 28.9 శాతం మంది చిన్నచిన్న ఇంగ్లీష్ పదాలు కూడా పలకలేకపోతున్నారు. 39.6 శాతం మంది గడియారం చూసి సమయం చెప్పలేకపోతున్నారు. బరువును కొలవడం చాలా మందికి తెలియదు. కిలోలు, లీటర్ల లెక్కన ఏయే వస్తువును ఎలా కొలుస్తారు? వాటి లెక్క ఏమిటని 43.4 శాతం మందికి అసలు తెలియదు. సులభమైన వాటిని పొడవులు, వెడల్పులో ఎలా కొలుస్తారో కూడా పది శాతం మంది పిల్లలకు తెలియదు. 39.2 శాతం మంది పిల్లలకు కనీసం లెక్కించడం కూడా తెలియదు' అని సర్వేలో గుర్తించారు.
- 17 నుంచి 18 ఏళ్ల మధ్య ఉన్నవారు సైతం చదువులో వెనుకబడి ఉన్నారు. 24.2 శాతం మంది రెండో తరగతి పాఠ్యాంశాలను చదవలేకపోతున్నారు. 42.9 శాతం మందికి చిన్నచిన్న భాగాహారాలు కూడా రావు. 23.6శాతం మంది చిన్న చిన్న ఇంగ్లీష్ పదాలు చదవలేకపోతున్నారు. 35.1 శాతం మందికి వాచ్/గడియారం చూసి సమయం చెప్పడం కూడా రాదు. 34.9 శాతం మందికి బరువులు కొలవడం, 6.2 శాతం మందికి పొడవు, వెడల్పు లెక్కించడం రావని సర్వేలో తేలింది.
- 14 నుంచి 18 ఏళ్ల వయసున్న వారిలో 24.5 శాతం మంది రెండో తరగతి పాఠ్యపుస్తకంలో పదాలు, వాక్యాలు చదవలేకపోతున్నారు. 41.8 శాతం మంది చిన్నచిన్న బాగాహారాలు చేయలేకపోతున్నారు. 27.3 శాతం మంది ఇంగ్లీష్ పదాలను చదవలేకున్నారు. 38.3 శాతం గడియారం చూసి టైము చెప్పలేకపోతున్నారు. 40.9 శాతం మందికి బరువు కొలవడం కూడా తెలియదు. సులభమైన పొడవు లెక్కించడం 8.2 శాతం మందికి, కష్టమైన వాటిని లెక్కించడం 36.9 శాతం మందికి తెలియడం లేదని సర్వే తేల్చింది.


మెంటాడ పంచాయతీ గొల్లపేటలో చెట్ల కిందే విద్యార్థుల చదువులు

ప్రభుత్వ విధానాలతోనే

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చింది. పాఠశాలలను కుదించి పరిసర పాఠశాలల్లో విలీనం చేసింది. ఉపాధ్యాయులను సైతం సర్దుబాటు చేసింది. ఆన్‌లైన్ బోధనకు ప్రాధాన్యం ఇస్తోంది. ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టి మాతృభాష, ప్రాంతీయ భాషలను నీరుగార్చినట్టు విమర్శలున్నాయి. బైజూస్ లాంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకొని ఉపాధ్యాయుల పాత్రను నిర్వీర్యం చేసింది. ఇవన్నీ విద్యాబోధనపై ప్రభావం చూపుతున్నాయి. ప్రభుత్వం అంకెల గారడీ కోసం పరితపించడంతో విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మిగులుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి గుణాత్మకమైన విద్యకు ప్రాధాన్యమివ్వాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వాల జోక్యం తగ్గాలి

ప్రాథమిక స్థాయిలో విద్యాబోధన మరింత మెరుగుపరచాలి. ప్రభుత్వ జోక్యం తగ్గాలి. లేనిపోని నిర్ణయాలతో విద్యను ప్రభుత్వం నీరుగార్చుతోంది. రెండేళ్ల కొవిడ్‌వ్యాప్తివలన విద్యార్థులు వెనుకపడ్డారు. ఆన్‌లైన్ వర్కుల భారం ఉపాధ్యాయులపై పడుతోంది. బోధనలో ఉపాధ్యాయులకు స్వేచ్ఛ ఇవ్వాలి. విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే గుణాత్మకమైన విద్య అందించాలి. సమాజం పట్ల అవ గాహన పెంచాలి.

-డీ.కోటేశ్వరరావు,
యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు, రణస్థలం

గుణాత్మక విద్య అవసరం

విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో కూడా సమాజం పట్ల అవగాహన లేకపోవడం వాస్తవం. కేవలం ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసమే విద్య కాదు. గుణాత్మకమైన విద్య చాలా అవసరం. విద్యారంగంలో సంస్కరణల మూలంగా అసలు లక్ష్యం దెబ్బతింటోంది. 3,4,5వ తరగతి విద్యార్థులను హైస్కూల్లో విలీనం చేయడం, ఏకోపాధ్యాపాఠశాల పెరగడం, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల భారం పెరగడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వాలు రాజకీయ ప్రయోజనాల కోసమే పాకులాడడమే ఈ పరిస్థితికి కారణం.

-మీసాల శ్రీనివాసరావు, ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్

పెళ్లికార్డు ఇస్తామని చెప్పి దోపిడీ

- మహిళపై కత్తిదూసి పిడిగుద్దులు
- రూ.1.50లక్షల అపహరణ

పలాస, జనవరి 25: పెళ్లికార్డు ఇస్తాం తలుపు తీయాలంటూ ఇద్దరు ఆగంతుకులు ఓ ఇంట్లో చొరబడి మహిళపై దాడి చేశారు. రూ.1.50 లక్షలు అపహరించి.. ఉడాయించారు. పలాస- కాశీబుగ్గలోని తిలక్‌నగర్‌లో గురువారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాశీబుగ్గ కేటీరోడ్డులోని ఓ హోటల్ నిర్వాహకుడు గోవిందరావు కుమార్తె రోహిణి.. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో హెచ్ ఆర్ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఇటీవల సంక్రాంతి సెలవులకు ఇంటికి వచ్చారు. తల్లిదండ్రులు వ్యాపారరీత్యా బయటకు వెళ్లగా రోహిణి ఒక్కరే ఇంట్లో ఉన్నారు. ఈ క్రమంలో గురువారం ఉదయం 11గంటల సమయంలో ఓ వ్యక్తి వారింటికి వచ్చి అనాథ శరణాలయం నుంచి వచ్చానని పాతదుస్తులు కానీ, నగదు కానీ ఇవ్వాలని కోరాడు. ఇంట్లో ఎవరూ లేరని ఆమె చెప్పగా ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. పది నిమిషాల తర్వాత భార్యాభర్తలుగా అనుమానిస్తున్న ఇద్దరు వ్యక్తులు వచ్చారు. తాము మీ నాన్నకు తెలిసిన వాళ్లమని, పెళ్లికార్డు ఇచ్చేందుకు వచ్చామని, తలుపులు తీయాలని చెప్పారు. దీంతో రోహిణి తలుపులు తీయగా.. వెంటనే ఆమె ముఖంపై పిడిగుద్దులతో దాడి చేశారు. అనంతరం ఆమె మెడపై కత్తి పెట్టి డబ్బులు ఎక్కడని ప్రశ్నించారు. తన వద్ద నగదు లేదని, బంగారం మాత్రమే ఉందని చెప్పడంతో అవి తమకు అవసరం లేదని, కేవలం డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కిచెన్‌లో రూమ్‌లో నగదు కోసం వెతికారు. అనంతరం బెడ్‌రూములోకి తీసుకువెళ్లి నగదుపెట్టె తాళాలు తీయాలని ఆదేశించారు. అందులో వ్యాపార అవసరాల కోసం దాచుకున్న రూ.1.50లక్షలు తీసుకుని క్షణాల్లో ఇద్దరూ పరారయ్యారు. గంటపాటు ఇద్దరు దొంగలు ఆ ఇంట్లో హల్‌చల్ చేశారు. వారు వెళ్లిపోగానే రోహిణి తన తండ్రికి ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ నాగేశ్వరరెడ్డి, సీఐ విజయానంద్, క్లూస్‌టీమ్ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ విజయానంద్ తెలిపారు.


బాధితురాలి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

విద్యుత్ సమస్యలపై 29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

టెక్కలి/పలాస, జనవరి 25: విద్యుత్ సమస్యలపై ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. ఈ మేరకు పలాస ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.ప్రసాద్, టెక్కలిలోని పర్యవేక్షణ ఇంజినీర్ ఎస్.కృష్ణమూర్తి గురువారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. 'శ్రీకాకుళం ట్రాన్స్‌కో సర్కిల్ కార్యాలయమందు 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాలకు గాను ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై నాలుగు రోజుల పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ చేపడతాం. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం 2 గం టల నుంచి 4.30 గంటల వరకు కార్యక్రమం నిర్వహిం చనున్నాం. వీటిపై సందేహాలున్నా.. సలహాలు ఇవ్వా లన్నా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి' అని వారు కోరా రు. మరిన్ని వివరాలకు 9440812387, 7382585630 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ పునః మూల్యాంకన ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల, జనవరి 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల పునః మూల్యాంకన ఫలితాలను వీసీ కేఆర్ రజని గురువారం విడుదల చేశారు. బీటెక్ ఆరో సెమిస్టర్, డిగ్రీ 2,4,6 సెమిస్టర్‌ల పునఃమూల్యాంకన ఫలితాలను విడుదల చేశారు. వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్‌లో ఫలితాల వివరాలను అందుబాటులో ఉంచారు.

విధులు ముగిసినా.. వేతనాల్లేవ్!

- రైతుభరోసా కేంద్రాల ప్రత్యేక సిబ్బంది గగ్గోలు
- డబ్బుల కోసం జిల్లాలో 1,170 మంది ఎదురుచూపు

(ఇచ్ఛాపురం రూరల్)

ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతుభరోసా కేంద్రాల్లో తాత్కాలిక ప్రాతిపదికన నియమించిన సిబ్బందికి వేతనాలు అందక అవస్థలు పడుతున్నారు. కేవలం రెండు నెలల కాలపరిమితికి వీరిని నియమించగా.. గడువు పూర్తయినా వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ప్రభుత్వం ఏటా మార్పులు చేస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన రెండేళ్ల తర్వాత సహకార సంఘాలను పక్కనబెట్టి ధాన్యం కొనుగోలు బాధ్యతలను రైతుభరోసా కేంద్రాలకు అప్పగించింది. దీనికి సంబంధించిన పనులకు ఖరీఫ్, రబీ సీజనల్లో రెండు నెలలు చొప్పున పనిచేసేలా టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), డేటా ఎంట్రీ ఆపరేటర్(డీవో), హెల్పర్ (సహాయకుడు) పోస్టులను సృష్టించింది. పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ఈ కొలువులను తాత్కాలికంగా భర్తీ చేశారు. టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.15వేలు, డేటాఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12వేలు, సహాయకులకు రూ.9వేలు చొప్పున వేతనం చెల్లించాలని నిర్ణయించారు. ధాన్యం తేమ శాతంతో పాటు నాణ్యత పరిమాణాలు లెక్కించడం, వాటిని తూకం వేసి, ట్రక్ షీట్ రసీదు పొంది వారికి మిల్లుకు కేటాయించే బాధ్యతలను వారికి అప్పగించారు. ఈ మేరకు జిల్లాలో 390 రైతుభరోసా కేంద్రాల్లో ప్రతీ కేంద్రంలో ఒక టీఏ, ఒక డీవో, ఒక సహాయకుడు చొప్పున మొత్తం 1,170 మందిని రెండు నెలలు పని చేసేలా నియమించారు. వీరు రోజూ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో రైతుభరోసా కేంద్రాల ద్వారా 3.83లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు అధికారులు చెబుతున్నారు. కాగా.. జిల్లాలో చాలా మండలాల్లో ధాన్యం కొనుగోలు పూర్తయినా ఇప్పటివరకు జీతాలు అందజేయకపోవడంతో తాత్కాలిక సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. వేతనాలు త్వరగా చెల్లించాలని కోరుతున్నారు.



కేదారిపురంలోని రైతుభరోసా కేంద్రం

త్వరలో చెల్లింపులు..

రైతుభరోసా కేంద్రాల్లో తాత్కాలిక సిబ్బంది పని చేసిన రోజుల ఆధారంగా వేతనాలను సహకార సంఘాల ద్వారా చెల్లిస్తాం. ఇప్పటికే వారి వేతనాలకు సబంధించి నిధులు సహకార సంఘాల ఖాతాల్లో జమ చేశాం. ఈ నెలాఖరు నాటికి వారి చెల్లింపులు పూర్తవుతాయి.

-కె.శ్రీనివాస్, జిల్లా మేనేజర్, సివిల్ సప్లై


మెళియాపుట్టి: బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలు పంపిణీ చేస్తున్న వెంకటరమణమూర్తి


కాశీబుగ్గ: మాట్లాడుతున్న వెంకన్న చౌదరి


ఇచ్ఛాపురం రూరల్ : తలతంపరలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు


పాతపట్నం:దువ్వారవీధిలో భవిష్యత్ గ్యారెంటీ పత్రం అందజేస్తున్న లక్ష్మయ్య


ఇచ్ఛాపురం: మునిసిపాలిటీలోని 11వ వార్డులో కరపత్రం అందజేస్తున్న లీలారాణి


సంతబొమ్మాళి: తీరప్రాంతంలో పర్యటిస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీకి చరమగీతం పలకాలి

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, జయహో బీసీ కార్యక్రమాల్లో ప్రభుత వైఫల్యాలపై టీడీపీ నేతల ధ్వజం

రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పలకాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సీఎం జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. గురువారం జయహో బీసీ, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు-గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. బాండ్లు పంపిణీచేశారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమలుచేసే పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై ధ్వజమెత్తారు.

●**కొత్తూరు:** వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆరోపించారు. మాతల క్యాంప్ కార్యాలయంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ పాల్గొన్నారు.

●**మెళియాపుట్టి:** భవిష్యత్ తరాలు బాగుపడాలంటే చంద్రబాబునాయుడును సీఎం చేయవలసిన అవసరంఉందని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. జాడుపల్లి క్లస్టర్‌లో బాబుష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు బూర్లె లలితకూమారి, ఎంపీటీసీ సుజాత పైడిరాజ్, వసంత్ ,పరమేష్‌రెడ్డి, భాస్కరరావు, శశి పాల్గొన్నారు.

●**నరసన్నపేట:** రానున్న ఎన్నికల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేటలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లు జాబితాలను పరిశీలించి తొలగింపు ఓటర్లు ఉంటే వివరాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శిమ్మ చంద్రశేఖర్, కింజరాపు రామారావు, గొద్దు చిట్టిబాబు, పీస కృష్ణ, గుణుపురం రామలక్ష్మి, బోయన ఆనంద్, బెవర రాము, తాళాభక్తుల గోవిందరావు పాల్గొన్నారు.

●**సంతబొమ్మాళి:** టీడీపీకిపార్టీ ఆవిర్భావం నుంచి మత్స్యకారులు అండగా ఉన్నారని ఆ పార్టీ మండలఅధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న తెలపారు. మేఘవరం,మరువాడ పంచాయతీల్లో పర్యటించారు. రానున్న ఎన్నికల్లో తీరప్రాంత గ్రామాల ప్రజలు మరోసారి టీడీపీకి అండగా నిలవాలనికోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిదపాన ధర్మార్జునరెడ్డి, నాయకులు సూరాడ ధనరాజ్, కర్రి రామిరెడ్డి,వరపటి రాజశేఖర్, సూరాడ భీమారావు,సువ్వారి ప్రసాద్, పంగ అశిరినాయుడు పాల్గొన్నారు.

●**పాతపట్నం:** పాతపట్నం దువ్వారవీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీకార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్రఉపాధ్యక్షుడు పైల లక్ష్మయ్య, క్లస్టర్ ఇన్‌చార్జి అక్కంద్ర సన్యాసిరావు, బూత్ ఇన్‌చార్జి రుంకు చలపతిరావు పాల్గొన్నారు.

● **మందస:** మండలంలోని తాళ్లగురంటి పంచాయతీలో చిన్నకోస్టా, గౌడుగురుంటిల్లో టీడీపీ పల్లెపల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మందస టీడీపీ అధ్యక్షుడు భావన దుర్యోధన, రట్టి లింగరాజు, ఎం.నవీన్‌కుమార్, ఎం.చంద్రశేఖర్, సవర లఖియా, సాలిన జానకిరావు పాల్గొన్నారు.

●**ఇచ్ఛాపురం రూరల్:** టీడీపీతోనే సామాజికాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు మాదిన ప్రదీప్, మాదిన రామారావు తెలిపారు. కంచిలి బూత్ నెంబర్ 200, తలతంపర, ముండల గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మత్రిపాటి పూర్ణ, ఆనంద్, రవి కుమార్ పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం :** చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్ ఉంటుందని టీడీపీ జిల్లా మహిళా కార్యదర్శి, 11వ వార్డు కౌన్సిలర్ ఆశిలీలారాణి తెలిపారు.మునిసిపాలిటీలోని 11వవార్డు కస్పా-సయ్యద్‌ఖాన్ వీధిలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

● **సరుబుజ్జిలి:** ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని చంద్రయ్యపేట పేరంటాల వీధుల్లో టీడీపీ నాయకులు తమ్మినేని విద్యాసాగర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి నాయకులు వేణుగోపాల్, బాలు పాల్గొన్నారు.

● **కాశీబుగ్గ:** సార్వత్రిక ఎన్నికల్లో ఐక్యంగా టీడీపీని గెలిపించాలని పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి తెలిపారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధిలో గల 17,18,20వవార్డులో పల్లెపల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, బడ్డ నాగరాజు,సూర్యనారాణ,నవీన్‌కుమార్,గాలి కృష్ణారావు, కె.నరసింహులు,ఉమాకాంత్,ఎన్.శ్రీను,రవిశంకర్ గుప్తా పాల్గొన్నారు.

రేపు 'పిలుస్తోంది రా కదలిరా': బగ్గు

జలుమూరు:పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా కార్యక్రమాన్ని శనివారం శ్రీముఖలింగంలో నిర్వహించనున్నట్లు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. గురువారం చల్లవానిపేట సర్పంచ్ పంచిరెడ్డి రామచంద్రరావు స్వగృహంలో యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీముఖలింగంలో నిర్వహించే కార్యక్రమంలో వైసీపీకి చెందిన సర్పంచ్ తమ్మన్నగారి సతీష్ తో పాటు పలు కుటుంబాలు టీడీపీలో చేరుతున్నట్లు తెలిపారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షులు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, దుంగ స్వామిబాబు, పంచిరెడ్డి రామచంద్రరావు, కింజరాపు సత్యం, తర్ర బలరాం, బాలకృష్ణ, నక్క రమేష్, గుండ రామకృష్ణ, ఎం.దామోదరరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

రాష్ట్రంలో అరాచక పాలన: ఎంపీ

పలాస/రూరల్: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని ఎంపీ కింజరాపు రామ్మోహన్నాయుడు ఆరోపించారు. గురువారం మండలంలోని రెంటికోటలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు.టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష మాట్లాడుతూ టీడీపీ ప్రభంజనం చేసి వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందన్నారు.అనంతరం రెంటికోట నుంచి 50 కుటుంబాలు, కాంట్రగడ నుంచి 15 కుటుంబాలు, లొత్తూరు నుంచి 73 కుటుంబాలు ఎంపీ, శిరీష సమక్షంలో టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరికట్ల విఠల్‌రావు, దువ్వాడ కృష్ణమూర్తినాయుడు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్తదుర్గారావు, లొడగల కామేశ్వరరావు, మల్లా శ్రీనివాసరావు, హొరియా మోహనరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 45 కుటుంబాలు

మందస మండలం సొండిపూడికి చెందిన 45 కుటుంబాలు పార్టీ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష సమక్షంలో పార్టీలో చేరాయి. ఈసందర్భంగా వారికీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. వైసీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు అవుగాన ఈశ్వరరావు, కోనారి తాతారావు, మాధవరావు, కూర్మారావు, సంతోష్ తదితరులు టీడీపీలో చేరారు.కార్య క్రమంలో టీడీపీ నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, కర్రయ్య, రట్టి లింగరాజు, భాస్కరరావు, రుద్రయ్య పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన నాయకులతో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, గౌతు శిరీష


సరుబుజ్జిలి: ఆమదాలవలసలో బాబుష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


మందస: గౌడుగురంటిలో టీడీపీ పల్లెపల్లెకు కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

అన్నక్యాంటీన్‌కు ఆదరణ


అన్నక్యాంటీన్‌లో భోజనాలు వడ్డిస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి టీడీపీ కార్యాలయం ఆవరణలో రూ.ఐదుకే భోజనం అందించాలన్న ఉద్దేశంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని టీడీపీ నాయకులు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్, తర్ర రామకృష్ణ తెలిపారు. అన్నక్యాంటీన్‌ప్రారంభించి 182 రోజులుగా పేదవాడి ఆకలి తీర్చుతున్నట్లు చెప్పారు. గురువారం అన్న క్యాంటీన్ ద్వారా భోజనాలు అందించేందుకు సంతబొమ్మాళి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన తంగి రమణమూర్తి కుమారుడు, కుమార్తె రీమ్మోహన్‌సాయి, జోస్న జన్మదినంపురస్కరించుకుని రూ.10వేలు వితరణగా నిర్వాహకులు లాడిశ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి కామేశ్వరరావు, కోరాడ పెద్దగోవింద, చిన్నగోవింద,బోయిన సత్య శ్రీనివాస్, రాంకుమార్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై వినతి

వజ్రపుకొత్తూరు: ఉద్దానం రైతుల సమస్యలపై పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళకు వినతిపత్రం అందించినట్లు పలాస నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ సమన్వయకర్త త్రిశాం తారావు చెప్పారు. గురువారం అక్కుపల్లిలో ఆయన విలేకరు లతో మాట్లాడుతూ జీడిపిక్కలకు మద్దతు ధర ప్రకటించాలని,కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలని, మత్స్యకారులకు అత్యంత వెనుకబడిన కులంగా గుర్తించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమర కృష్ణ, బైపల్లిశివ, రత్నాల చలపతిరావు, లండ నరేష్, లండ జయరాం, బడ్డ రుద్రమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

ఎల్.ఎన్.పేట:డొంకలబడవంజలో ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్‌సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా గ్రంథాలయానికిగ్రామానికి చెందిన పెద్దకోట సాయికుమార్ పోటీపరీక్షల పుస్తకాలను గురువారం వితరణగా అందజేశారు. పుస్తకాలు ఇచ్చిన సాయికు మార్‌కు సొసైటీ అధ్యక్షుడు వెంకటరావు అభినందించారు.

మహిళలతోనే రాష్ట్రాభివృద్ధి

జలుమూరు: మహిళలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు తెలిపారు. చల్లవానిపేటలో గురువారం ఆసరా పథకం కింద మహిళలకు నాలుగో విడత సున్నా వడ్డీ రాయితీలను పంపిణీ చేశారు.

జనసేన కార్యాలయం ప్రారంభం

జలుమూరు (సారవకోట): సారవకోటలో గురువారం జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నాయకులు బచ్చల పృథ్వీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ పోలాకి మండలాధ్యక్షుడు దండాసి, ప్రధాన కార్యదర్శి వి.వరలక్ష్మి, జనసేన నాయకులు శ్రీను, రాజు, సూర్య, సతీష్, శంకర్, జగదీష్, అప్పలస్వామి, రాజేశ్వరి పాల్గొన్నారు.

నివగాంలో న్యాయవిజ్ఞాన సదస్సు

కొత్తూరు:మండలంలోని నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో న్యాయవిజ్ఞానసదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తూరు కోర్టు సూపరింటెండెంట్ టి.నూకరాజు,సీనియర్ అసిస్టెంట్ జి.శ్రీనివాసరావు,ఎస్ఐ కె.శివాజీరెడ్డి, ఏజీపీ రాడరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అప్పారావు, న్యాయవాదులు ధర్మారావు, రవికుమార్, ప్రసాద్, కృష్ణారావు, పాఠశాల ప్రధాన అధ్యాపకులు నిర్మల పాల్గొన్నారు.

'వంటా-వార్పు'నకు కదలిరావాలి

కొత్తూరు: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 30, 31 తేదీల్లో విజయవాడలో నిర్వహించే వంటా-వార్పు కార్యక్రమాన్ని కదలిరావాలని వీవోఏల యూనియన్ నాయకుడు సతివాడబాలామణి, గొర్లె శ్రీనివాసరావు, కార్మిక సంఘం నేత శిర్ల ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కొత్తూరు మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు.సమావేశంలో డి.జయంతి, శాంతి, భీమరాజు, బెనర్జీ, ధనలక్ష్మి, స్వప్న, చిన్నమ్మలు పాల్గొన్నారు.

15 నుంచి సాముహిక వివాహాలు

● నేటి నుంచి నువ్వలరేవులో పెళ్లి పనులకు శ్రీకారం

వజ్రపుకొత్తూరు: సంప్రదాయాలు, ఆచారాలకు నిలయమైన నువ్వలరేవులో సాముహిక వివాహాలకు ముహూర్తం ఖరారైంది. మార్చి15 నుంచి మూడురోజులపాటు వేడుకలు నిర్వహణకు, 16వ తేదీ రాత్రి 1.59 నిమిషాలకు ముహూర్తం నిశ్చయించారు.కాగా ఒడిశాసంప్రదాయప్రకారం శుక్రవారం నుంచి మాఘమాసం ప్రారంభంకానుంది. దీంతో ఇక్కడవివాహాల పనులు ప్రారంభించుకోవచ్చని గ్రామపెద్దలుస్పష్టంచేశారు. నువ్వలరేవులో రెండువందల ఏళ్ల నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి సాముహిక వివాహాలు జరుగుతున్న విషయం విదితమే.అయితే జనాభా పెరగడంతో ప్రతిఏటా సాముహిక వివాహాలు జరిపిస్తున్నారు.వివాహాలకు ముందు గ్రామదేవ తలకు ప్రసాదాలు అందించే కార్యక్రమం మూడురోజులు నిర్వహిస్తారు.తరువాత సాముహిక వివాహాలకు సంబంధించి ఇళ్ల ముందు పందిళ్లు వేస్తారు. గ్రామపెద్దలు పర్యవేక్షణలో సాముహిక వేడుకలు జరుగుతాయి, ఈ పెళ్లిళ్లకు సంబంధించి మైకొసెట్లు, పంతుళ్లు, ఇతర అవసరాలు గ్రామపెద్దలు సమకూర్చుతారు.

విప్లవ యోధుడు లెనిన్

సంతబొమ్మాళి: అణగారిన ప్రజల పక్షాన పోరాటం చేసిన విప్లవయోధుడు లెనిన్ అని సీపీఐ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ తెలిపారు. గురువారం మండలంలోని వడ్డితాండ్రలో లెనిన్ శతవర్ధంతి సభ, ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ లెనిన్‌ను స్ఫూర్తిగా తీసుకొని కాకరాపల్లి ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్,నంబూరి వెంకటరావు, కారుణ్య కేశవ పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ అధికారప్రతినిధిగా శివ్వాల



ఎల్.ఎన్.పేట: మండలంలోని రావిచెంద్రి గ్రామానికి చెందిన శివ్వాల తేజేశ్వరరావు టీడీపీ బీసీసెల్ అధికార ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు. అచ్చెన్నాయుడు నుంచి ఆదేశాలొచ్చాయని గురువారం తేజేశ్వరరావు తెలిపారు.తాను పార్టీకి అందించిన సేవలకుగాను గుర్తింపు కల్పించడంతో పార్టీ జాతీయ అధ్యక్షుడు ఎన్.చంద్రబాబు నాయుడుకు, రాష్ట్రఅధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'ఒకే మినరల్ ట్యాక్స్ అమలుచేయాలి'

టెక్కలి: ఒకే దేశం..ఒకే మినరల్.. ఒకే ట్యాక్స్ విధానం అమలుచేయాలని ఫెడరేషన్‌ఆఫ్ మైనర్‌మినరల్స్ ఇండస్ట్రీ జనరల్ సెక్రటరీ డాక్టర్ సీహెచ్‌రావ్ కోరారు.గురువారం కేంద్ర మైన్స్ సెక్రటరీ శ్రీకాల్ కాంతారావుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన మైన్స్ కార్యదర్శి కాంతారావు త్వరలో కేంద్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి చింతన్ గ్రూప్ ఏర్పాటుచేయనుందని తెలిపారు.

అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నాయకులు



కోటబొమ్మాళి: నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిశారు. కోటబొమ్మాళి పంచాయతీ బంజీరుపేట గ్రామానికి చెందిన నాయకులు తమ సమస్యలు వివరించారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: ఎంఈవో

నరసన్నపేట: పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేవిధంగా తగిన తర్ఫీదు ఇవ్వాలని ఎంఈవో ఉప్పాడ శాంతారావు సూచించారు. గురువారం సుందరాపురం ఉన్నత పాఠశాలను పరిశీలించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణఇవ్వాలన్నారు పారశెల్లి ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఏ పరీక్షలను పరిశీలించారు. దేశవానిపేట పాఠశాలను ఎంఈవో -2 పేడాడ దాలినాయుడు తనిఖీచేశారు.

క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలి: కలమట

పాతపట్నం: యువత క్రీడాస్ఫూర్తిని అలవరచుకోవాలని టీడీపీ రాష్ట్రకార్యదర్శి కలమట సాగర్ తెలిపారు.గురువారం బొమ్మికలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈపోటీల్లో 40 జట్లు పాల్గొనగా విజేతగా ఎస్‌జేపురం, రన్నర్స్‌గా పాతపట్నం జట్లు నిలిచాయని నిర్వాహకకమిటీ తెలిపారు.

ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

నందిగాం: ఇంటిపన్ను వసూళ్లపై కార్యదర్శులు దృష్టి సారించాలని డివిజినల్ పంచాయతీకార్యదర్శి ఐవీ రమణ సూచించారు.గురువారం నందిగాంలోఎంపీడీవో పి.రాజారావు అధ్యక్షతన కార్యదర్శులతో సమీక్షించారు. సమావే శంలో కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, లక్ష్మణ్, డిల్లేశ్వరరావు పాల్గొన్నారు.

190 మందికి కంటి పరీక్షలు

నరసన్నపేట:స్థానిక బొడ్డవలస సత్యసాయి మందిరంలో 190 మందికి కంటి పరీక్షలను నిర్వహించి, 65 మందికి శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రతినిధి బాలగంగాధర్‌రాజు, సత్యసాయి మందిర కన్వీనర్ నాగేశ్వరరావు, కేఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలి


టెక్కలిలో ధర్నా చేస్తున్న పెన్షనర్లు

టెక్కలి: కేంద్ర ప్రభుత్వంతో సమానంగా రాష్ట్ర పెన్షనర్లకు కూడా పెండింగ్ డీఆర్‌లు తక్షణమే చెల్లించాలని,పెన్షనర్లకు ప్రతినెలా ఒకటో తేదీన పెన్షన్ చెల్లించాలని పెన్షనర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి రామచంద్రరావు, కె.ధనుంజయరావు కోరారు. గురువారం టెక్కలి తహసీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ధర్నానిర్వహించారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు కార్యక్రమంలో కోత ధర్మారావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, అయ్యబాబు, స్టాలిన్, చిట్టెన్న, కామేశ్వరరావు, వీరస్వామి పాల్గొన్నారు.

● **పలాస రూరల్:** పెండింగ్‌లో ఉన్న పెన్షన్ల సమస్యలను పరిష్కరించాలని, డీఆర్‌లను అందజేయాలని రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్‌చేశారు. పలాస తహసీల్దార్ కార్యాలయంలో రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలనినిరసన తెలిపారు. గతంలో తమకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డీటీ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు కుమార్‌నాయక్, పలాస పెన్షనర్ల యూనిట్ అధ్యక్ష,కార్యదర్శులుమాధవరావు,అప్పారావు, నర్సింగరావు, సుందరరావు, ఆర్.దుర్యోధన పాల్గొన్నారు.

అకాల వర్షంతో అపరాల పంటకు నష్టం


జలుమూరులోని ఓ కళ్లంలో వర్షానికి తడిసి ముద్దయిన మినుము చేను

పలాస రూరల్: జిల్లాలో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున కురిసిన అకాలవర్షానికి అపరాల పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలాస మండలం చినంచలలో కళ్లాలో ఉంచిన ధాన్యం తడిచిపోవడంతో ఉదయం రైతు లు వాటిని ఎండబెట్టే పనుల్లో నిమగ్నమయ్యారు.● **జలుమూరు:** మండలంలోని అచ్చుతాపురం, నగరికటకం, తిమడాం, అల్లాడ, జలుమూరు తదితర గ్రామాల్లో పెసర, మినుము చేలు తడిసి ముద్దయ్యాయి. పండిన పెసన, మినుము చేనును కొంతమంది రైతులు కళ్లాలకు తరలించి ఎండబెడుతుండగా మరి కొంతమంది రైతులు పొలాల్లోనే ఆరబెట్టారు. అకస్మాతుగా తెల్లవారు జామున వర్షం కురవడంతో అపరాలకు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోతున్నారు.


ఏపీ ఇన్నోవేషన్ సొసైటీతో ఆదిత్య ఒప్పందం


ఏపీ ఇన్నోవేషన్ సొసైటీతో ఒప్పందం చేసుకుంటున్న ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు

టెక్కలి: కె.కొత్తూరు వద్ద గల ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఏపీ ఇన్నోవేషన్ సొసైటీతో గురువారం ఒప్పందం కుదుర్చుకుంది.దీంతో విద్యార్థులకు స్టార్ట్ అప్, వివిధ పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఏపీ ఇన్నో వేషన్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ అనిల్‌తెంటు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థుల ఐడియా జనరేట్‌చేస్తే ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందుతుందని చెప్పారు.రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌ను అభివృద్ధి చేసి ఆదిత్యను నాక్‌లో మంచి గ్రేడ్ వచ్చేలా, ఎన్ఆర్ఐఎఫ్‌లో మంచి ర్యాంకింగ్‌కు కృషిచేస్తామని తెలిపారు. కాగా ఇన్నోవేషన్ సొసైటీ చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ అనిల్ తెంటును సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాసరావు, విష్ణుమూర్తి, బి.రాజేష్, సతీష్, ఆజాద్, సురేష్ పాల్గొన్నారు.











టీడీపీ బీసీలకు పుట్టినిల్లు

● మాజీ మంత్రి కిమిడి కళా వెంకటరావు



కళా వెంకటరావును సన్మానిస్తున్న దృశ్యం

రణస్థలం: తెలుగుదేశం పార్టీ ఆది నుంచి బీసీలకు పుట్టినిల్లని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎచ్చెర్ల నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి కిమిడి కళా వెంకటరావు అన్నారు. గురువారం కొండములగాంలో నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ చేట్టారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బీసీల నైపుణ్యం వెలికితయడమే లక్ష్యంగా తీసుకువచ్చిన 30కిపైగా పథకాలను జగన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిన ఘనత జగన్‌రెడ్డిదేనన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొర్లె విజయ్‌కుమార్, పిషని జగన్నాధంనాయుడు, దన్నాన సత్తిబాబు, మజ్జి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే సంక్షేమం



టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న దృశ్యం

జి.సిగడాం: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర సంక్షేమం సాధ్యమని ఐటీడీపీ విజయనగరం పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు విమల అన్నారు. గురువారం మెట్టవలస, డీఆర్ వలస గ్రామాల్లో క్లస్టర్ ఇన్‌చార్జీలు కుమరాపు రవికుమార్, టంకాల మౌళీశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన మినీ మేనిఫెస్టోని ప్రజల్లోకి తీసుకు వెళ్లాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పైల రామకృష్ణంనాయుడు, బెవర జగన్నాథరావు, టి.కిషోర్, మహదాశ్యం చిన్నారావు, కంచరాన సూరన్నాయుడు, గొల్లాజీ, బోగది అప్పలనాయుడు, చిత్తిరి అసిరినాయుడు, కాశిబాబు, డి.వెంకరమణ, జె.దాసు, బూపతి శ్రీరామూర్తి, వంశీ, వై శ్రీనివాసరావు, బి.చిన్నబాబు, నక్క మురళి, కూనుబిల్లి కూర్మారావు, పి.బంగారినాయుడు, ఎస్.గోవిందరావు, బూత్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో పనిచేద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: క్రమశిక్షణతో పనిచేసి చంద్ర బాబును మళ్లీ ముఖ్య మంత్రిని చేద్దామని మాజీ మంత్రి గుండ అప్పలసూర్య నారాయణ, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి పిలుపు నిచ్చారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక పాలనతో జగన్‌కు ఇప్పటికే ఓటమి భయం పట్టుకుందని, సైకోను సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ నెల 27న నియోజకవర్గంలో నిర్వహించ నున్న జయహో బీసీ కార్యక్ర మంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. దివంగత ఎన్టీఆర్ పేరున రూపొందించిన డైరీని గుండ దంపతులు గురువారం ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, ఐటీడీపీ అధ్యక్షుడు ప్రధాన విజయరాం, నాయకులు బరాటం ఉదయశంకర్ గుప్తా, బీమశంకరరావు, చిన్నారావు, చిట్టి నాగభూషణరావు, సూరిబాబు, ఎం.వెంకటేష్, సుశీల, బుక్కా యుగంధర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకత తేటతెల్లం

అరసవల్లి: నగరంలోని ఓ కార్యక్రమంలో పాల్గొని మంత్రి ధర్మాన మాట్లాడుతూ.. మీ కుటుంబ సభ్యులకు మీరే నచ్చచెప్పాలని మహిళలకు చెప్పడం చూస్తుంటే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ప్రభుత్వంపై ప్రజలకు గల వ్యతిరేకత ఏమిటో అర్థమవుతోందని, మంత్రిపై మాటలే ఇందుకు రుజువని మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. గురువారం తమ నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి ధర్మాన కాంగ్రెస్ పార్టీలో ఉన్నప్పుడు జగన్‌రెడ్డి కోసం ఏం మాట్లాడారో అందరికీ తెలుసన్నారు.

20 మంది పోలీసులకు సేవా పురస్కారాలు

శ్రీకాకుళం క్రైం: జిల్లాలో నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో 20 పోలీసులకు సేవా పురస్కారాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు ఎస్పీ జీఆర్ రాధిక 20 మందితో కూడిన జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. వీరిలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ బి.విజయకుమార్, ఎస్ఐలు ఎ.విజయకుమార్ (రూరల్) జి.నారాయణ స్వామి (హిరమండలం), బి.హైమావతి(సోంపేట), ఏఆర్ ఎస్ఐ ఎం.అప్పారావు, ఏఎస్ఐ కె.జిన్నారావు (వజ్రపుకొత్తూరు), హెచ్‌సీలు ఎం.శ్రీనివాసరావు (పోలాకి), ఎం.పార్థసారథి (ఏఆర్), హెచ్‌సీ పి.తులసమ్మ (దిశ), పీసీలు ఎం.జోగారావు (జేఆర్ పురం), ఎం.లోకనాథం (టెక్కలి), పి.శరత్ చక్రవర్తి(సైబర్ సెల్), హెచ్.కిషోర్ (డీఎస్‌బీ), ఎం.సంతోష్‌కుమార్ (ఏఆర్, ఎస్టీఎఫ్, ఎస్‌బీ ఎక్స్), జి.ప్రసాదరావు (డీపీటీసీ), ఎం.సింహాచలం (ట్రాఫిక్), హోమ్ గార్డులు ఆర్.రవికుమార్ (కాశీబుగ్గ), బి.అప్పలనాయుడు (డీపీవో గార్డెన్), సీనియర్ అసిస్టెంట్ ఎన్.హరిహరరావు, జూనియర్ అసిస్టెంట్ డి.బాలామణి ఉన్నారు. వీరందరికి శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందించనున్నారు.

ABN ఆంధ్రజ్యోతి
ఏబీఎన్ - ఆంధ్రజ్యోతిలో మరిన్ని క్రైం వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
మీ స్మార్ట్‌ఫోన్‌లో యాప్ స్టోర్ నుంచి క్యూఆర్ కోడ్ స్కానర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే, మీ ఫోన్ కెమెరా ద్వారా ఈ కోడ్‌ను స్కాన్ చేయవచ్చు.

యువకుడి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

నరసన్నపేట: పట్టణంలోని ఒక బంగారం షాపులో పని చేస్తున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం నరసన్నపేటలో చోటు చేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక బండివీధికి చెందిన కోట్ని రాకేష్(23) పట్టణంలో ఒక బంగారం షాపులో పనిచేస్తున్నారు. షాపులో లావాదేవీ వ్యవహారంలో ఆ షాపు యాజమాని అనుమానించడంతో మనస్తాపానికి గురైన రాకేష్ ఇంట్లో తల్లి లేని సమయంలో ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. చిన్నతనంలో తండ్రిని కోల్పోయిన రాకేష్.. ఇంటర్ నుంచి తల్లి కళావతికి చేదోడువాదోడుగా ఉండేవాడని.. ఒక వైపు డిగ్రీ చదువుతూనే కుటంబం భారం మోసి రాకేష్ ఆత్మహత్యకు పాల్పడడం దుర దృష్టకరం. తల్లి కళావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ బి.ప్రసాదరావు తెలిపారు. ఘటనా స్థలాన్ని సీఐతోపాటు ఎస్ఐ సింహాచలం పరిశీలించారు. తల్లి కళావతి పట్టణంలో ఒక వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నారు.

రైలు కిందపడి ఒకరి మృతి



మహేష్(ఫైల్)

కోటబొమ్మాళి: ఎత్తురాళ్లపాడు గ్రామానికి చెందిన కెల్లి మహేష్(24) హరిశ్చం ద్రపురం రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో గురువారం సాయంత్రం రైలు కిందపడి మృతిచెందాడు. పలాస జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తగరపువలసలోని ఓ కంపెనీలో మహేష్ ఉద్యోగం చేస్తున్నాడు. అనారోగ్యం వల్ల సంక్రాంతికి ముందే గ్రామాని వచ్చాడు. గురువారం ఉదయం విశాఖ వెళ్తున్నానని చెప్పి బయలు దేరాడు. సాయంత్రానికి హరిశ్చంద్రపురం రైల్వే ఫ్లైఓవర్ కింద తన ద్విచక్రవాహనం నిలిపి.. అక్కడికి సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. అయితే మహేష్ ప్రమాదవశాత్తు మరణించాడా? లేక ఆత్మహత్యకు పాల్పడ్డాడ అన్నది విచారణలో తేలాల్సి ఉంది. మహేష్ తండ్రి కృష్ణారావు, తల్లి శాంతమ్మ, సోదరి స్వాతి ఉన్నారు. పలాస జీఆర్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస రైల్వే ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

పెద్ద బొరిగివలసలో దొంగతనం

నరసన్నపేట: పెద్దబొరిగివలసలో ఎడ్ల రమేష్ ఇంట్లో దొంగతనం జరిగినట్టు సీఐ బి.ప్రసాదరావు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గురువారం రమేష్ ఆటో నడిపేందుకు బయటకు వెళ్లగా, పొలం పనులకోసం అతడి భార్య నిర్మల ఇంటికి తాళం వేసి వెళ్లింది. ఆ సమయంలో తాళం పగుల గొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న ఐదు తులాలు బంగారు ఆభరణాలు, నాలుగు తులాలు వెండి, రూ.68 నగదును అపహరించారు. ఘటన స్థలాన్ని సీఐ ప్రసాదరావు, ఎస్ఐ సింహాచలం, క్లూస్‌టీం పరిశీలించారు ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గంజాయితో ముగ్గురి అరెస్టు

మందస: కొత్తపల్లి సమీపంలో బరంపురం నుంచి పలాస వైపు వాహనంతో గురువారం గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు మందస ఎస్ఐ బి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుల్లు మజ్జి, కేరళ రాష్ట్రానికి చెందిన బినేస్ బేబీ కృష్ణ, అజినల్‌లను అరెస్టు చేసినట్లు చెప్పారు.ఈ మేరకు వారి నుంచి ఏడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

భూ వివాదంలో 65 మందిపై కేసు నమోదు

హిరమండలం: అవలంగి పంచాయతీ బొమ్మికగూడలో ఓ భూమి విషయంపై గురువారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 65 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నారాయణస్వామి చెప్పారు. అవలంగికి చెందిన పడాల రఘు మరో 40 మందితో తమ గ్రామంపైకి వచ్చి యంత్రాలతో ఇళ్లు ధ్వంసం చేశారని, అడ్డుపడిన వారిపై దాడికి దిగారని బొమ్మిక గూడకు చెందిన సవర ప్రసాద్ ఫిర్యాదు చేశాడు. తన భార్య, మహిళలపై చంపేస్తామని బెదిరిస్తూ కులం పేరుతో దూషించారని పేర్కొన్నాడు. తన పంట పొలంలో యంత్రంతో చదును చేస్తుండగా బొమ్మికగూడ గ్రామానికి చెందిన సవర ప్రసాద్ మరో 25 మందితో వచ్చి దాడి చేశాడని అవలంగి గ్రామానికి చెందిన పడాల రఘు ఫిర్యాదు చేశాడు. పనులు చేస్తుండగా యంత్రానికి అడ్డువచ్చి తమపై రాళ్లతో దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జిరాయితీ పొలం అని చెప్పినా ఆక్రమణకు దిగారని తెలిపారు. ఇది వరకే హిరమండలం పోలీసు స్టేషన్‌లో ఆక్రమణదారులపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇరువార్గల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

శ్రీకాకుళం క్రైం: నగరంలో నిర్మిస్తున్న మినీ స్టేడియం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్మించాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. అరసవల్లిలోని ఇంద్ర పుష్కరిణికి ఆనుకుని ఉన్న 2.75 ఎకరాల్లో మినీ స్టేడియం నిర్మాణానికి గురువారం మంత్రి ధర్మాన ప్రసాదరావు శంకుస్థాపన చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఇంజనీర్ సుగునాకర్, రామ్‌మనోహర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే సింగుపురం గ్రామంలో గురువారం గడపగడపకు ప్రభుత్వం తోపాటు ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, ఎంపీడీవో రామ్మోహన్‌రావు, జడ్పీటీసీ రుప్ప దివ్య పాల్గొన్నారు.

● **లావేరు:** సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాలు సాధ్యమని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన నాలుగో విడుత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ, జడ్పీటీసీ మీసాల సీతంన్నాయుడు, ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఏపీఎం మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

'గడప గడప'తో ఒరిగిందేమీలేదు

పొందూరు: వైసీపీ నాయకులు నిర్వహిస్తున్న గడప- గడపకు కార్యక్రమంతో ప్రజలు ఒరిగిందేముందని తాడివ లస సర్పంచ్ తమ్మినేని మనెమ్మ ప్రశ్నించారు. గురువా రం పత్రికా ప్రకటన విడుదల చేశారు. గడప-గడప పేరుతో గ్రామాల్లో తిరిగితే అభివృద్ధి జరుగుతుందా అని ప్రశ్నించారు. నిధులు విడుదల చేయని ప్రభుత్వానికి గ్రామాల అభివృద్ధిపై మాట్లాడే అర్హత లేదన్నారు.

ఏడుగురు సీఐల బదిలీ

శ్రీకాకుళం క్రైం: విశాఖ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న ఏడుగురు సీఐలకు గురువారం స్థానచలనం చేస్తూ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న వసంశెట్టి శ్రీనివాసరావు, టి.కల్యాణి, రొంగలి అప్పలనాయుడు, శ్రీకాకుళం జిల్లా డీఎస్‌బీ(ఎక్స్) సీఐ జి.దాలిబాబుకు విశాఖ సిటీకి బదిలీ చేశారు. అలాగే విశాఖ రేంజ్‌లో వీఆర్‌లో ఉన్న జి.దివాకర్ వాయు నందన్ యాదవ్‌ను శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస సీఐగా, ఆమదాలవలస సీఐ పి.పైడయ్యను టెక్కలి బదిలీ చేశారు. అనకాపల్లి జిల్లా పోలీసు కంట్రోల్ రూమ్ సీఐ పి.పైడపు నాయుడును అనకాపల్లి ట్రాఫిక్ స్టేషన్‌కు బదిలీ అయింది.

క్రాప్ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

సోంపేట: రైతులు క్రాప్ రుణాలను రెన్యువల్ చేసుకుంటేనే రాయితీలు వస్తాయని పీఏసీఎస్ సీఈవో నారాయణ, అధ్యక్షుడు రౌతు విశ్వనాథం కోరారు. పంట రుణాలు తీసుకున్న ప్రతీరైతూ ఫిబ్రవరి 15వ తేదీలోగా 7శాతం వడ్డీతోపాటు భూమికి సంబంధించిన 1బీ, ఆధార్ ప్రతం, ఫోన్ నెంబరును అందించాలని కోరారు. లేకుంటే 13శాతం వడ్డీ కట్టాల్సి వస్తుందన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.గురుప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. క్వాంటమ్ పెన్షన్ యథావిధిగా కొనసాగించాలి, డీఆర్, పీఆర్‌సీ బకాయిలు విడుదల, హెల్త్‌కార్డు ద్వారా గుర్తింపు, రీయింబర్స్‌మెంట్ రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని తదితర డిమాండ్స్ చేశారు. కార్యక్రమంలో పెన్షనర్లు సంఘం అధ్యక్షుడు కొణతాల మోహన్‌రావురెడి. బాగా జయపతి, బాలయ్య, ఆనంద్ పాల్గొన్నారు.

● **కవిటి:** పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘ నాయకులు గురువారం తహశీల్దార్ రామచంద్రరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి, 11వ పీఆర్‌సీ ఏరియల్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

● **సోంపేట:** పెన్షనర్ల సంఘం పిలుపుమేరకు స్థానిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పండి కృష్ణారావు, తూముల రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

● **రణస్థలం:** పెన్షనర్ల సమస్యలను తక్షనమే పరిష్కరించాలని రణస్థలం, లావేరు మండలాల సంఘం అధ్యక్షుడు పి.నర్సింహుల నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వై.పాపినాయుడు, పిన్నింటి సూర్యనారాయణ, సీహెచ్ గోపాల్‌రావు, బాలి రామినాయుడు, మన్నే కృష్ణానందం, మహంతి రమణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

● **పొందూరు:** సమస్యలు పరిష్కారం కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిటైర్డు ఉద్యోగులో ఆందోళన చేపట్టారు. అనంతరనం తహసీల్దార్ వైవీ ప్రసాదరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు అంకం ధర్మారావు, పీఎస్ ప్రకాశరావు, దండా సూరిబాబు, వి.దామోదర రావు, మనోరమ తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో ఉద్దానం యూత్

కవిటి: సమాజ సేవలో ఉద్దానం యూత్ క్లబ్ ఎప్పుడు ముందు వరుసలో ఉంటుందని బొరివంక సర్పంచ్ బెందాళం శ్రీరామ్‌ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని బొగిడియపుట్టుగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉద్దానం యూత్ క్లబ్ సభ్యులు టై, బెల్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాజేష్, ఉద్దానం యూత్ క్లబ్ అధ్యక్షుడు దీనబంధు, ఎంపీటీసీ సతీష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని ఓ ప్రైవేట్ హై స్కూల్‌లో 1998-03 మధ్య చదువుకున్న విద్యార్థులు స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి సందడిని గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠశాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. స్కూల్ హెచ్‌ఎం మర్గేట్ అన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్: బుడ్డెపుపేట గ్రామంలో బోన్ కాన్సర్‌తో బాధపడుతున్న కొనతాల పద్మ కుమార్తెకి వైద్య ఖర్చుల నిమిత్తం ఈదుపురం ఉన్నత పాఠశాలలో 2010-11 టెన్త్ చదువుకున్న విద్యార్థులు గురువారం రూ.10 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

'ఆ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే'



నిరసన తెలుపుతున్న సిటిజన్ ఫోరం సభ్యులు

ఆమదాలవలస: శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారిలో జరుగుతున్న ప్రమాద మరణాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ హత్యలేనని ఆమదాలవలస సిటిజన్ ఫోరం సభ్యులు ఆరోపించారు. గురువారం ఈ రహదారిపై సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జేజే మోహన్‌రావు, బొడ్డేపల్లి మోహన్‌రావు, సనపల అన్నాజీరావు, కార్యవర్గ సభ్యులతో కలిసి ఈ రోడ్డు దుస్థితిపై నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా భారీ గుంతలతో ఉన్న ఈ రహదారిలో ప్రయాణిస్తున్న ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు కనీసం స్పందించకపోవడం శోచనీయమన్నారు. సుమారు పది మంది మృత్యువాత పడగా, 36 మంది గాయపడ్డారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కనీసం గుంతలైనా చదును చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సింగూరు నర్సింగరావు, కె.షన్ముఖరావు, జి.జగన్నాథం, వై.సత్యం పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

శ్రీకాకుళం క్రైం: రానున్న ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్ధమవ్వాలని వైసీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర రీజియన్ పరిధిలో ప్రజాప్రతినిధులను, నాయకులను, ఎన్నికలకు సమాయత్తం చేసేందుకు ఈ నెల 27న భీమిలి నియోజకవర్గం సంగివలస వద్ద బహిరంగ సభ నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. చరిత్రలో నిలిచిపోయేలా సభను విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. అనంతరం ఎన్నికల ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్‌కుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

ఐటీ రంగంలో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం



ఒప్పందం పత్రాలతో వీసీ రజని, సొసైటీ సీఈవో అనిల్‌కుమార్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఐటీ రంగంలో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్టు వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీ, ఏపీ ఇంక్యుబేషన్ సొసైటీ అనుబంధ విశాఖ ఐటీ సెజ్‌లోని సన్‌రైజ్ ఇంక్యుబేషన్ హబ్‌తో గురువారం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో వర్సిటీ అధ్యాపకులకు, విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఏపీ ఇంక్యుబేషన్ సొసైటీ సీఈవో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. ఇప్పటికే రాష్ట్రంలోని పలు విద్యా సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని 44 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటుచేశామన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖరరావు తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఏయూలో పరీక్షల విభాగం సేవలు విస్తరించాలని వీసీ కేఆర్ రజని సూచించారు. వర్సిటీలో పరీక్షా విభాగం అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం, పునః మూల్యాంకనం, ఫలితాల విడుదలలో జాప్యం ఉండకూడదన్నారు. కార్యక్రమంలో డీన్‌లు డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, డాక్టర్ ఎం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో యువత చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: తెలుగుదేశం పార్టీ యువనాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ ఆధ్వర్యంలో 40 మంది యువత గురువారం టీడీపీలో చేరారు. వీరికి శంకర్ తన కార్యాలయంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీకి యువ నాయకత్వం అవసరమని, లోకేష్ నాయకత్వంలో యువత క్రమశిక్షణతో పనిచేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమరావతి రైతులకు చేసిన అన్యాయాలకు వ్యతిరేకంగా రైతులు చేపట్టిన దీక్షలు నేటికి 1500 రోజులకు చేరిన నేపథ్యంలో గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో 108 కొబ్బరికాయలు కొట్టి మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో ఇప్పిలి తిరుమల, రెడ్డి శంకర్, బాషా షరీఫ్, బుర్రి మధు, బొల్లా నాగేంద్రయాదవ్, గొండు వెంకట రమణమూర్తి, రుప్ప భాస్కర్, గొండు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



అవగాహన కల్పిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు



టెక్కలి: సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో..

ఎచ్చెర్ల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ఎం తో కీలకమని ఎంపీ రా మ్మోహన్‌నాయుడు అన్నారు. శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో గురువారం నిర్వహించిన జాతీయ ఓట రు దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీనివస రావు, యాజమాన్య ప్రతినిధి పి.దుర్గాప్రసాద్‌రాజు పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో, ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు.



జి.సిగడాం: మండల కేంద్రంలో..



ఇచ్ఛాపురంలో ర్యాలీగా..



నరసన్నపేట: డిగ్రీకళాశాల ఆవరణలో..

బాలలతో పనిచేయిస్తే చర్యలు

ఆమదాలవలస: పట్టణంలో వివిధ విభాగాల్లో వ్యాపారులు, మెకానిక్ షెడ్‌లు, ఫలహార, భోజనశాలల్లో బాలలతో పనిచేయిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులు హెచ్చరించారు. గురువారం ఆమదాలవలస పట్టణంలో బాల కార్మిక నిర్మూలన సంస్థ సభ్యులతో కలిసి పోలీసులు తనిఖీలు చేపట్టారు. బాల కార్మికులను గుర్తిస్తే 1098, 100, 112, 181కు తెలిజేయాలన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా బాలల రక్షణ విభాగం కౌన్సిలర్ ధర్మాన సీతారాములు, సోషల్ వర్కర్ సింగూరు శ్రీనివాసరావు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం నుంచి ఎస్ఐలు ఎస్.కేవశరావు, ఎల్.వెంకటరావు, లేబర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, చైల్డ్‌లైన్ సిబ్బంది సాయిలక్ష్మి, సీఆర్‌పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లినేనిలో చైల్డ్‌కేర్ టేకర్‌పై శిక్షణ

శ్రీకాకుళం అర్బన్: నిరుద్యోగ, ఒంటరి మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చైల్డ్‌కేర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఎనిమిదో తరగతి చదివి, 18 నుంచి 38 ఏళ్ల వయసు లోపు గల మహిళలు అర్హులు అని చెప్పారు. మూడు మాసాలు శిక్షణ ఉంటుందని, ఆ తర్వాత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వివరించారు. డిగ్రీ పాసైన వారికి పేషెంట్స్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇచ్చి కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని స్పష్టంచేశారు. ఇంటర్ బైపీసీ పూర్తి చేసిన వారికి బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వివరించారు. పూర్తి వివరాల కోసం 7680945357, 9121999654 ఫోన్ నెంబర్లులో సంప్రదించాలన్నారు. ఆసక్తిగలవారు శ్రీకాకుళం సమీపంలో గల రాగోలులోని జెమ్స్ హాస్పిటల్ క్యాంపస్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఎస్ ఆఫీస్, కంప్యూటర్ ట్యాలీ, జీఎస్‌టీ అంశాల్లో 30 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై 19-45 ఏళ్ల లోపు మహిళలు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులని చెప్పారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 79933 40407, 95534 10809 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

పోలీసు కవాతు రిహార్సల్స్ పరిశీలన

శ్రీకాకుళం క్రైం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో పోలీసులు నిర్వహించిన కవాతు రిహార్సల్స్‌ను ఎస్పీ జీఆర్ రాధిక పరిశీలించారు. తొలుత జాతీయ జెండాను ఎస్పీ ఎగురవేసి వందనం చేశారు. పరేడ్ కమాండర్ ఎస్పీకి గౌరవ వందనం సమర్పించారు. అలాగే వాహనంలో పరేడ్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు టీపీ విఠలేశ్వరరావు, జె.తిప్పేస్వామి, డీఎస్పీలు వై.శృతి, వాసుదేవరావు, సీఐ పి.శ్రీనివాసరావు, ఆర్ఐలు సురేష్, ఉమామహేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

షిర్డీసాయి ఊరేగింపు

జి.సిగడాం: ఆనందపురంలో షిర్డీసాయి వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం బాబా చిత్ర పటాన్ని ఘనంగా ఊరేగించారు. ఆశ్రమంలో గల 100 అడుగుల సాయికోటి మహాస్తూపం నుంచి బయలుదేరి ఐదు కోట్ల సాయి నామములు గల సాయికోటి పుస్తకాలతో వాండ్రం గి, పొందూరు గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సాయి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

సెబ్ ఎస్ఐగా అనిల్‌కుమార్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎస్ఐగా అనిల్ కుమార్ గురువారం విధుల్లో చేరారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన మునలినాయుడు సీతమ్మధార సెబ్‌కు బదిలీపై వెళ్లారు. విశాఖ డివిజన్‌లో టాస్క్‌ఫోర్స్‌లో ఎస్ఐగా ఉన్న అనిల్ కుమార్ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్జ: కొల్లివలస 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 26న మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు ఏఈ అప్పన్న గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రెండు గంటల వరకు గుత్తావల్లి, లాభాం, నారాయణపురం, చిన్నలంక, చీడివలస, గంగంపేట, కొల్లివలస, ఉప్పినివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

సర్క్యులర్‌ను తక్షణమే రద్దు చేయాలి

అరసవల్లి: వీవోఏల కాలపరిమితి సర్క్యులనర్‌ను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి.అసిరినాయుడు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్‌కు గురువారం వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వీవోఏల ఉపాధిని దెబ్బతీసేలా మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ తీసుకురావడం అన్యాయమన్నారు. ఉపాధి కోల్పోయిన వీవోఏలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 30, 31వ తేదీల్లో విజయవాడలో ధర్నా, వంటా వార్పు నిర్వహించనున్నట్టు తెలిపారు. డి.జోగారావు, జి.యర్రయ్య పాల్గొన్నారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఈ నెలలో జరిపిన నియమాకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని వివిధ సంఘాల నేతలు వీసీ కేఆర్ రజనిని గురువారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా, రిజర్వేషన్ పాటించకుండా, ఎలాంటి ప్రకటన లేకుండానే వర్సిటీలో ఇటీవల పలువురిని నియమించడంపై దర్యాప్తు చేయాలని వీసీని కోరారు. వీసీని కలిసినవారిలో సామాజిక న్యాయపోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి రాంగోపాల్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, దుర్గాసి గణేష్, టొంపల రమణ తదితరులు ఉన్నారు.

జీవో 12 వెంటనే అమలు చేయాలి

అరసవల్లి: మున్సిపల్ కార్మికులకు సంక్రాంతి కానుక రూ.1000 చెల్లించాలని, ప్రభుత్వం ఇచ్చిన జీవో నెం.12ను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షుడు అరుగుల గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసును కలిసి వినతిపత్రం అందించారు.

నిబంధనలు పాటించాలి

ఆమదాలవలస: సచివాలయంలో పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ సమయలో నిబంధనలు పాటించాలని సీనియర్ అసిస్టెంట్ కంచరాప వెంకట్, రాజేష్ సూచించారు. గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో ఉన్న సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, ఎల్ఎన్ పేట, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు.